సేవాభావం తప్పనిసరి

విజయనగరం: ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఈశ్వర్‌కౌశిక్ పిలుపునిచ్చారు. నగరంలోని రింగ్‌రోడ్డు వద్ద అమ్మ సేవా సొసైటీ ఆధ్వర్యంలో నిరుపేదలకు శనివారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేత్రదానం

విజయనగరం అర్బన్: హిందీ మంచ్ జిల్లా కమిటీ సలహాదారుడు, హిందీ నికేతన్ వ్యవస్థాపకుడు కొమ్మాజోష్యుల మురళీకృష్ణ శుక్రవారం మరణించగా ఆయన నేత్రాలను వారి కుటుంబ సభ్యులు జిల్లా రెడ్‌క్రాస్‌కు దానం చేశారు. ఈ సందర్భంగా ఆయన భార్య ఉమాబాల మాట్లాడుతూ, ఆయన నేత్రాలు సజీవంగా ఉండాలనే ఉద్దేశంతోనే నేత్రదానం చేసినట్లు చెప్పారు.

జనహృదయ నేతకు జోహార్లు..

ఆంధ్రప్రదేశ్‌ను పాలించిన ముఖ్యమంత్రుల్లో దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రాధాన్యత విశిష్టమైనది. అన్నదాతకు అండగా నిలబడినా.. ఆరోగ్యశ్రీతో లక్షలాది మందికి ప్రాణాలు పోసినా.. ఉచిత విద్యుత్‌తో వ్యవసాయాన్ని పండగలా మార్చినా.. సంక్షేమ పథకాలతో పేదలకు పెద్ద కొడుకుగా మారినా.. అది రాజన్నకే చెల్లుతుంది. అటువంటి మహనీయుడి రూపు కానరాక తెలుగు ప్రజానీకం గుండె తల్లడిల్లుతోంది.. ఆంధ్రప్రదేశ్‌ను హరితాంధ్రప్రదేశ్‌గా మార్చిన రాజన్నకు గుర్తుగా ఆయన జయంతిని రైతు దినోత్సవంగా జరుపుకుంటున్నారు. విజయనగరం, నెల్లిమర్ల నియోజకవర్గాల్లో రాజన్న జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. మహానేత విగ్రహాలకు పూలమాలలు వేసి, క్షీరాభిషేకాలు చేసి నివాళులర్పించారు.

– విజయనగరం/నెల్లిమర్ల నెట్‌వర్క్



భోగాపురం : వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు



విజయనగరం ఫోర్ట్: వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న డీసీఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ భావన, విక్రమ్



నెల్లిమర్ల రూరల్ : మొయిద జంక్షన్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తున్న నాయకులు



డెంకాడలో : వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు



విజయనగరం: వెలుగు వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు



పూసపాటిరేగ: ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు అప్పలనాయుడు, తదితరులు



విజయనగరం టౌన్: వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యూనియన్ నాయకులు

మా హయాంలోనే అభివృద్ధి..

- మంత్రి బొత్స, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, ఎమ్మెల్సీ పెనుమత్స

విజయనగరం: వైఎస్సార్‌సీపీ హయాంలోనే విజయనగరం అభివృద్ధి చెందిందని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. నాలుగేళ్లలో విజయనగరం జిల్లా కేంద్రం రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని చెప్పారు. రూ.10.15 కోట్ల అంచనాలతో నగరంలో చేపట్టబోయే 116 పనులకు సంబంధించిన మాసోత్సవ శంకుస్థాపన కార్యక్రమాన్ని శనివారం అట్టహాసంగా ప్రారంభించారు. ముందుగా గంటస్తంభం జంక్షన్ నుంచి బాలాజీ జంక్షన్ వరకు రూ.1.03 కోట్ల వ్యయంతో నిర్మించతలపెట్టిన బీటీ రోడ్డు నిర్మాణానికి ఎం.ఆర్. కళాశాల కూడలి వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని మంత్రి బొత్స సత్యనారాయణ, స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, మేయర్ విజయలక్ష్మి, తదితరులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి బొత్స మాట్లాడుతూ, అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడతామన్నారు. టీడీపీ నాయకులు నాలుగేళ్లుగా ఇంటిలో కూర్చుని ప్రజలను తప్పుదోవ పట్టించడానికి ఇప్పుడు బస్సుయాత్రలు చేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయాయాదవ్, కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు, ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి సత్యనారాయణ, ఎమ్మెల్యే కోలగట్ల, ఎమ్మెల్సీ పెనుమత్స, తదితరులు

పాయల కవితకు 'నాటా'అవార్డు

విజయనగరం టౌన్: ఉత్తర అమెరికా తెలుగు సమితి (నాటా) సాహిత్య వేదిక ప్రతిష్టాత్మకంగా 2023 సంవత్సరానికి ఉత్తమ కవితల విభాగంలో ఇటీవల పోటీలు నిర్వహించింది. ఆ పోటీల్లో ప్రముఖ కవి, రచయిత పాయల మురళీకృష్ణ రచించిన కవిత 'గచ్చింసెట్టు కటూ ఇటూ' కవిత వంద డాలర్ల బహుమతిని పొందిందని రచయిత పాయల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో పాయలను పలువురు సాహితీవేత్తలు హర్షం వ్యక్తం చేశారు.



పాయల మురళీకృష్ణ

త్వరగా అభివృద్ధి పనులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారి ఆలయ అభివృద్ధి పనులు వీలైనంత త్వరగా మొదలు పెట్టాలని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఆదేశించారు. మూడులాంతర్లు వద్దనున్న చదురుగుడిలో కొలువైన అమ్మవారిని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఆలయ కార్యవర్గ సభ్యులతో కలిసి శనివారం దర్శించుకున్నారు. ఆయన వెంట ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇందుకూరి రఘురాజు, నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు శ్రావణి, లయాయాదవ్, ఆలయ ఈఓ కేఎల్.సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.



ఆలయ విస్తరణ పనులపై ఈఓ సుధారాణికి సూచనలు చేస్తున్న మంత్రి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

విజయనగరం రూరల్: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి భాస్కరరావు సూచించారు. విజయనగరం మండలంలోని దుప్పాడ గ్రామాన్ని శనివారం ఉదయం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రాకోడు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.జగదీష్, వైద్య సిబ్బందితో కలసి గ్రామంలో పర్యటించారు. పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. రాకోడు పీహెచ్‌సీ సీహెచ్‌ఓ మాణిక్యం, ఎంపీహెచ్‌ఈఓ సన్యాసిరావు, హెచ్‌వీ జయ, సిబ్బంది శ్రీను, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

'మన పార్లమెంట్' పుస్తకావిష్కరణ

విజయనగరం: ప్రతిష్టాత్మకమైన భారత పార్లమెంట్ విశేషాలతో పాటు లోక్‌సభ, రాజ్యసభ ఎన్నికలపై తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షుడు, ప్రముఖ రచయిత సముద్రాల గురుప్రసాద్ రాసిన మన పార్లమెంట్ పుస్తకాన్ని విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ ఆవిష్కరించారు. శనివారం మంత్రి నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, 1921లో అప్పటి పార్లమెంట్ శంకుస్థాపన నుంచి 2023 మే 28వ తేదీన ప్రస్తుత పార్లమెంట్ ఆవిర్భావం వరకు గల అనేక విశేషాలు పుస్తకంలో పొందుపరచడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు బవిరెడ్డి శివప్రసాదరెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బూర జగ్గారావు, రచయిత గురుప్రసాద్ పాల్గొన్నారు.



మన పార్లమెంట్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి ఏర్పాట్లు

విజయనగరం క్రైమ్: జిల్లాలో ఈ నెల 20 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు నిర్వహించనునక్న అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి సంబంధించి ముందస్తు సన్నాహక ఏర్పాట్లపై సెట్విజ్ సీఈఓ రామ్‌గోపాల్ శనివారం ఆరా తీశారు. ఈ మేరకు సంబంధిత అధికారులతో సమావేశమై బారికేడ్లు, రన్నింగ్ ట్రాక్, విద్యుత్, తాగునీరు, వైద్యం, తదితర సదుపాయాలపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పీటీసీ ప్రిన్సిపాల్ ఆనంద బాబు, ఆర్మీ రిక్రూట్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికం

సంక్షేమ పథకాలకు అర్హతే ప్రామాణికమని.. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని కార్పొరేషన్ డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయాయాదవ్ అన్నారు. నగరంలోని పదో డివిజన్ దాసన్నపేట రైతుబజార్ ప్రాంతంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించి, లబ్ధిదారులతో మాట్లాడారు.

- విజయనగరం

